# [illegible]

## నందం రామారావు

ఒక స్త్రీ నుదుట నుంచి కారుతున్న రక్తపు చుక్కలా ఆకాశం ఎర్రగా వుంది।

మంటల్లో కాలిపోతున్న పసిపిల్లవాడి ఆర్త నాదంలా ఆకాశంలోంచి సూర్యుడు కెక్క పెట్టి యేడుస్తున్నాడు।

సాయం సమయం చల్లగా లేదు.

చలిగా కూడా లేదు.

మరెలా వుంది?

వెచ్చగా వుంది।

వెచ్చదనం కోసం ప్రాకులాడుతున్న మల్లయ్య శరీరం ఇంకా వెచ్చగా వుంది।

పొలంలో తనపనేదో తను చూసుకుంటూ త్వరగా ఇంటికి వెళ్ళాలని పారిజాతం మహా ఇదైపోతోంది.

చేస్తున్నపని ఐపోగా ప్రక్కనే వున్న చిన్న కాలవలో గబగబా కాళ్ళు చేతులూ కడుక్కుని మల్లయ్య ఎదుట నిలబడింది.

"ఏటే పారిజాతం, అప్పుడే పనైపోయిందా?" అన్నాడు

"ఐపోయింది బాబుగారూ. నిన్నడిగితే డబ్బులు ఇవేశిస్తానన్నారు. ఇస్తారా బాబుగారూ."

మల్లయ్య పారిజాతం కేసి చూసాడు.

పారిజాతం—అప్పుడే కొన్న 'త్రీ కాజిల్స్' సిగరెట్ పాకెట్‌లా 'క్వీన్ ఆఫ్ క్వీన్' విస్కీలా వేయించిన కాలం జీడిపప్పులా వుంది! ఇంకా చెప్పాలంటే—ఉషోదయంలో మంచులో తడిసి విచ్చుకున్న గులాబీలా వెన్నెల్లో సన్నజాజుల్ని కుప్పపోసినట్టుగానూ వుంది।

"అదేమిటో పారిజాతం నిన్ను చూస్తుంటే చాలు...." మల్లయ్య పకపకా నవ్వేశాడు.

అప్పటికే తలొంచుకుని వున్న పారిజాతం.

"బాబుగారూ। సీకటి పడుతోంది. వెళ్ళి అన్నం వొండుకోవాలి. నాకోసం నా మావా. పిల్లలూ ఎదురుచూస్తూ వుంటారు దయచేసి డబ్బులిప్పించండి" అని అన్నది.

"ఏవిటే? ఎప్పుడు చూసినా నీ మావా. పిల్లలూ అంటావ్ ఒక్కసారి నాకేసి చూడకూడదా ఏవిటి?"

"మీరు అలా అనకూడదండి".

"ఏవిటీ? అనకపోతే వొచ్చేస్తావా?" అంటూ పకపకా నవ్వేసి—

"చూడు పారిజాతం? ఇక్కడెవరూ లేరు నేనెన్ని సార్లడిగినా నువ్వేదో అంటూనే వున్నావ్".

"నేనేమీ అనడం లేదండీ నాకు డబ్బులిప్పిస్తే వెళ్ళిపోతాను".

"నీకు డబ్బు కావాలి. అంతేగా తీసుకో ఇస్తాను. అదిగో అక్కడ కొత్తగా వేసిన పాక వుంది చూశావా? ఆపాక ఇంద్ర భవనంలా వుంటుంది. అక్కడ కొచ్చెయ్ ఇచ్చేస్తాను। ఐనా పారిజాతం। రోగంతో మంచమెక్కిన మొగుడుతో కాపురం ఎలాచేస్తావే పైగా ఇద్దరు పిల్లల్ని పోషించాలి నేచెప్పినట్టు నడుచుకున్నాననుకో అంతా ఆనందమే. ఆలోచించు మరి...." అంటూ మల్లయ్య ఆపాక కేసి నడవసాగాడు.

ఆ సమయంలో పడమటి దిశలో సూర్య గోళం పారిజాతం కోపంలా మండిపోతోంది

సుఖం కోసం వేసుకున్న పాకలోకి వెడుతున్న మల్లయ్యకేసి ఓసారి చూసింది

ఇంటిదగ్గర తనకోసం. తనేమైనా తినడానికి తీసుకొస్తానని ఇద్దరు పిల్లలూ ఆకలితో గోడ కానుకుని ఎదురుచూస్తూ వుంటారు తనజబ్బు నయం కావడం కోసం మందులేమైనా తీసుకొస్తుందేమోనని తన రాకకోసం జబ్బుతో వున్న భర్త ఎదురుచూస్తూ వుంటాడు

కానీ. ఇప్పుడు తను ఇంటికి ఏం తీసుకెళ్ళడం లేదు తను అష్టఐశ్వర్యాలను ఇంటికి తీసుకెళ్ళాలనుకుంటే తీసుకెళ్ళగలదు. 'నీతి' అనే రెండు అక్షరాలను మరచిపోతే కానీ తనా పని చెయ్యలేదు.


అక్కడ మల్లయ్య పాకలో చాలా నిబ్బరంగా పారిజాతం రాకకోసం ఎదురు చూడ సాగాడు. పారిజాతం తప్పకుండా వస్తుందని అతని నమ్మకం పిల్లల్నీ. మొగుడ్నీ ఎన్నాళ్ళని పస్తులుంచుతుంది? వాళ్ళకోసమైనా పారిజాతం రాక తప్పదు

మల్లయ్య నమ్మకాన్ని వమ్ముచేస్తూ పారిజాతం చాలా విబ్బరంగా ఇంటికేసి నడవసాగింది।

పారిజాతం ఇంటికెళ్ళేసరికి చీకటి పడి

పడుకున్నదన్న మాటేగానీ పారిజాతానికి నిద్రరావడంలేదు కళ్ళు మూసుకుంటేచాలు ఏవేవో భయంకరమైన దృశ్యాలు భయపెట్టసాగాయి. అర్ధరాత్రి సమయంలో ఆకలికి తాళలేక పిల్లలు ప్రాణం విడిచినట్టు భర్త మంచంలో దుఃఖిస్తున్నప్పుడు ఇంటికప్పు భర్తపై పడినట్టు....

పోయింది గుడి ముందు సందడే లేదు. కిరసనాయిలు దీపంకూడా వెలగటం లేదు అలికిడి కాకుండా నెమ్మదిగా దొంగలా తడిక తోసుకుని లోపలకెళ్ళింది.




తనింట్లో తనే దొంగలా ప్రవేశిస్తోంది

అలికిడైతే పిల్లలులేచి ఆకలి అంటూ ఏడుస్తారని భయం। అగ్గిపెట్టె ఎక్కడుందో తెలుసు గనుక తీసి దీపం వెలిగించింది.

తాళ్ళతో అల్లి ఎప్పుడైనా. ఏ క్షణంలోనైనా విరిగి పడిపోవడానికి సిద్ధంగా వున్న మంచంలో చంద్రం పడుకునినిద్రపోతున్నాడు

కొన్ని క్షణాలు భర్తకేసీ, ఆ మంచంకేసీ చూపింది.

ఈ మంచంలోనే తను ఎన్నో సుఖాలనూ. వైభవాలనూ అనుభవించింది. గత కాలపు వైభవాలను చిహ్నంగా ఆ మంచం అలాగే వుండిపోయింది ఇప్పుడు. ఇదే మంచంలో చంద్రం రోగంతో లేవలేక పోతున్నాడు.

దీపపు బుడ్డి ఎత్తి పట్టుకుని పిల్లలకేసి చూసింది.

చాపమీద ఏడేళ్ళశీను కాళ్ళు ముడుచుకుని పడుకున్నాడు. వాడి వంటిమీద చొక్కా కూడా లేదు. మాసి చినిగి పోయిన లాగూ మాత్రం వుంది మరోవేపున ఐదేళ్ళ లక్ష్మి పడుకుని వుంది. ఆ పాపకు బాగా మాసిన గౌను మాత్రం వుంది జుట్టంతా నూనెలేక చింపిరి పందరగా వుంది

దోమలు కుట్టగా ఆ పాప వులిక్కిపడి చేత్తో కాలిని గోక్కుంటూ కళ్ళు తెరచి చూసింది.

అప్పుడే పారిజాతం దీపాన్ని ఒక చేత్తో పట్టుకుని వొంగుని పిల్లల ముఖాల్లోకి తొంగి చూస్తోంది

ఆ పిల్ల తల్లిని గుర్తుపట్టి—

"అమ్మా" అంటూ ఘొల్లున యేడుస్తూ లేచి తల్లిని కౌగలించుకుంది.

పారిజాతం కూతురిని సముదాయిస్తూ—.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్ ?" అంది.

"అమ్మా। నా కాళ్ళ లేస్తోందే."

ఆ మాట వినడంతోనే ఆ తల్లి కూతుర్ని గట్టిగా కౌగలించుకుంది కూతురికి ఏం చెప్పాలో. ఎలా చెప్పాలో. ఎలా ఓదార్చాలో తెలియక. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూ వుండగా కూతురువీపు నిమురుతూ వుండిపోయింది।

ఇంతలో కొడుకు శీను లేచి కూర్చుని తల్లి కేసి తదేకంగా చూడసాగాడు

ఆ పిల్లలిద్దర్నీ ఆ స్థితిలో చూడగానే పారిజాతం కడుపు తరుక్కుపోయింది అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

పిల్లలకు ఒక ముద్ద అన్నం పెట్టలేని దౌర్భాగ్యపు బ్రతుకైపోయింది!

పారిజాతం లేచి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్లు తీసుకొచ్చి పిల్లలకు తాగిస్తూ—

"రేపు అన్నం తిందురు గాని ఇప్పుడు తినకూడదు ఇంత రాత్రప్పుడు అన్నం తింటే అరగదు జబ్బు చేస్తుంది. పడుకోండి" అంటూ చాపమీద పిల్లల్ని పడుకోబెట్టింది

పిల్లల సందడికి, భార్య మాటలకీ ఎప్పుడైన గానో లేచిన చంద్రం—

"కూలిడబ్బులు తీసుకురాలేదా," అన్నాడు పారిజాతం భర్త దగ్గరకెళ్ళి ప్రక్కనే కూర్చుని

జుట్టులోంచి వ్రేళ్ళు పోనిచ్చి తలని మురుతూ—

"వంట్లో ఎలా వుందయ్యా" అన్నది

"ఎలా వుందేవిటే పిచ్చిదానా మనలాటి వాళ్ళ వంట్లోకి ఏ రోగ మొచ్చినా అదేవిటో తెలిస్తేగదా! ఒకవేళ తెలిసినా అది నయమవుతే గదా! రోగంతో. మంచంలోంచి లేవలేక అలాగే చచ్చిపోవలసిందేనే." చంద్రం ఆపైన మాట్లాడలేకపోయాడు గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. ఐనా, శక్తినంతా కూడదీసుకుని—

"మనకు అన్నం లేకపోయినా ఫర్లేదు పిల్లలకైనా కొంచెం పెట్టగలిగితే చాలు" అన్నాడు

"కామందు కూలి డబ్బు రేపిస్తానన్నాడు. రేపటినుంచి ఇక మనకేం లోటుండదయ్యా నువ్వు హాయిగాపడుకో." అంటూ పారిజాతం భర్తకు చినిగిన దుప్పటి కప్పి తనూ పడుకుంది

పడుకున్న దన్న మాటేగానీ పారిజాతానికి నిద్ర రావడంలేదు కళ్ళు మూసుకుంటే చాలు ఏవేవో భయంకరమైన దృశ్యాలు భయపెట్టసాగాయి—అర్ధరాత్రి సమయంలో ఆకలికి తాళలేక పిల్లలు ప్రాణం విడిచినట్టు. భర్త మంచంలోంచి లేవాలని ప్రయత్నించి లేవలేక దుఃఖిసున్న సమయంలో ఇంటి పైకప్పు కాలిపోయి భర్తమీద పడినట్టూ....

పారిజాతం అశాంతిగా అటూ ఇటూ కదిలింది. 'నేనేమైనా ఫర్లేదు. నాపిల్లలూ, నాభర్త రేపటి నుంచి సుఖంగా వుండాలి' అని అనుకుంది.

* * *

మధ్యాహ్నం సమయంలో అందరూ భోజనాలు చెయ్యడానికి చెట్లక్రింద కెళ్ళినప్పుడు పారిజాతం పాకవేపు వెళ్ళింది.

పాక దగ్గర మల్లయ్య కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు. సరాసరి ఆయన దగ్గర కెళ్ళి తలొంచుకుని నిలబడింది పారిజాతాన్ని చూడ్డంతోనే ఆయన గంభీరంగా—"ఏవిటి?" అన్నాడు

దించినతల యెత్తకుండనే మాట్లాడకుండా వూరుకుంది "నిన్నే ఏవిటి?"

పారిజాతానికి ఎలా మాట్లాడాలో తెలియడం లేదు కానీ, ఒక్కటి మాత్రం తెలుస్తోంది— అందరూ ఇంటిదగ్గర ఆకలితో అలమటించి పోవడం!

"ఈ రోజు నుంచి నేను మీదాన్ని బాబుగారూ" అన్నది.

పారిజాతం అన్నది నిజమో, అబద్ధమో తెలియక మల్లయ్య ఆశ్చర్యంగా ఆమె కేసి చూశాడు.

పారిజాతం తలొంచుకునేవుంది.

"అవును బాబుగారూ! మీరు నా కోసం మనసుపడ్డారు, నా కోసం నేను మీ మీద మనసు పడుతున్నాను. మా కుటుంబానికే లోటూ రాకుండా తమరు చూడాలి"

"ఇదిగో చూడు పారిజాతం! మాటంటే మాటే. అదిగో అందరూ పనుల్లో కెడుతున్నారు. సాయంత్రం పనై పోగానే ఇక్కడికొచ్చెయ్. ఆ తర్వాత మనపని చూసుకుందాం..." అన్నాడు మల్లయ్య

* *

బాగా చీకటిపడిపోయిన తర్వాత ఆ పాకలోంచి బయట కొచ్చింది పారిజాతం

జుట్టంతా చెదరిపోయి, చీరంతా నలిగిపోయి అసలు మనిషి మొత్తమే నలిగిపోయింది!

ఆ చీకటిలో అడుగులో అడుగు వేసుకుంటూ నడవసాగింది. ఆలోచించడానిక్కూడా ఆమె మనస్సు, మెదడూ పనిచెయ్యడంలేదు!

శరీరమంతా పచ్చిపుండులా వుంది

పులిపంజా తగిలి గిలగిలా కొట్టుకుంటున్న అల్ప్రప్రాణిలావుంది!

అతి కష్టంమీద నడుస్తోంది.

ఆ పొలాల్లో ఎక్కడా ఏ విధమైన అలికిడి వినిపించడం లేదు ఆకాశంలో నక్షత్రాలున్నా మెరవడం లేదు!

గాలి మాత్రం చల్లగా వుంది.

ఐనా, ఏం ప్రయోజనం?

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ దూరంగా ఎక్కడో తీతువొకటి అరుస్తూ ఎటో వెడుతోంది!

పారిజాతం భయం భయంగా నడుస్తోంది

ఈ విశ్వమంతా ఒక్కసారిగా భగ్గునమండి సర్వనాశనమై. ఆ నాశనంలోంచి తను పుట్టికొచ్చినట్టు వణకసాగింది

నడుస్తున్నదల్లా ఏదో వెలుగు కనిపించినట్టు దిగ్గున ఆగిపోయి తలెత్తి చూసింది.

తనుంటున్న 'పాలెం' వచ్చేసింది. ఇళ్ళల్లోంచి అక్కడక్కడా దీపపు వెలుగు కనిపిస్తోంది

పారిజాతం చెమట పట్టిన ముఖాన్ని పమిట కొంగుతో తుడుచుకుంది చేతిలో వున్న




మార్పులు?

కలర్ టీవీ ప్రవేశపెట్టాక వచ్చే మార్పులేమిటి? అడిగాడు రామ్. శ్యామని

ఏముంది. మామూలు టీవీవల్ల బ్లయిండ్ నెస్ కలర్ టీవీవల్ల కలర్ బ్లయిండ్ నెస్ వస్తుంది" చెప్పాడు శ్యామ్

-సి. సత్యశేఖర్ (నెల్లూరు)






కావలసినవి ?

"రచయితకు ముఖ్యంగా కావాల్సినవి ఏమిటి ?" అడిగాడు రచనలు చేద్దామన్న ఉబలాటంగల ఉమాపతి రమాపతిని.

"పాత సంచికలు...." ఠక్కున చెప్పాడు రమాపతి

-పి. పతిశేఖర్ (నెల్లూరు)

'డబ్బును' విషసర్పాన్ని పట్టుకున్నట్టుగా పట్టుకుంది.

ఎలాగైతేనేం అతికష్టం మీద ఇంటికొచ్చింది ఆ చీకటిలో ఇంటి ముందు దీపవు బుడ్డిని పెట్టుకుని తన రాకకోసం చూస్తున్న భర్తనీ, పిల్లలను చూసి పారిజాతం నిలువునా వణికిపోయింది నోట మాట రాక మౌనంగా రోదించింది "నువ్విప్పుడు దాకా రాకపోతే ఏం జరిగిందోనని హడలిపోయాను పారిజాతం" అన్నాడు చంద్రం.

పారిజాతం నోట మాటరాక భర్త ముఖంలోకి చూసి తలదించుకుంది

"నువ్విపుడు దాకా రాకపోతే మాకు చలే భయమేసిందే అమ్మా" అంటున్న కొడుకుని దగ్గరకు తీసుకుని, మరో చేత్తో కూతురి తల నిమురుతూ–

"రండి అన్నం వండి పెడతాను అంటూ పారిజాతం లోపల కెళ్ళింది.

* * *

కలత నిద్దర్లో ఎప్పుడో మెలకువ రాగా పారిజాతం కళ్ళు తెరచి చూసింది.

టైమెంతయిందో తెలియదు

తెల్లవారడాని కింకెంత సమయం పడుతుందో ?

కళ్ళు మూసుకున్నా నిద్రరావడం లేదు.

తెల్లారడంతోనే మావను పట్నం తీసుకెళ్ళాలి. తీసుకెళ్ళి డాక్టర్‌కు చూపించాలి. తను తన మావను బ్రతికించుకోవాలి. అదే తను కోరుకునేది

ఎంతకీ నిద్రపట్టకపోవడంతో లేచి, ఇంట్లో పనులు చేసుకోసాగింది.

పనులన్నీ ముగించి భర్తనూ, పిల్లల్నీ లేపింది.

"మావా ! నీ పనులన్నీ త్వరగా కానీయ్. ఈ రోజు పట్నం వెళ్ళి పెద్ద డాక్టర్‌కు చూపిద్దాం"

డాక్టరా ! నీకేమైనా మతిపోయిందా ? ఎంత డబ్బు కావాలో తెలుసా ?"

"తెలుసు మావా డబ్బు గురించి నీకేం బెంగొద్దు. నువ్వు త్వరగా కానియ్" అంటూ పారిజాతం అక్కడనుంచి ఇవతలకొచ్చేసింది ఎదురుగా వున్న భర్త అడిగే ప్రశ్నలకు తను జవాబులు చెప్పలేదు గనుక

డాక్టర్‌కు చూపించి, మందులు కొని ఇంటికి తిరిగొస్తుంటే దారిలో చంద్రం అన్నాడు "ఇంత డబ్బు ఖర్చు పెట్టి చూపించకపోతే ఏం పోయింది. మనిషి ఈ రోజు కాకపోయినా మరో రోజైనా పోవలసిందే గదా ! ఐనా నీకింత డబ్బు ఎక్కడ్నుంచి వచ్చింది ?"

"కామందుగారు అప్పిచ్చారు మావా, నీకు త్వరలో నయమవుద్దని కూడా డాక్టర్ బాబుగారు చెప్పారు నీకు నయమైన తర్వాత ఇద్దరం కలసి అప్పు తీర్చేద్దాం" అని పారిజాతం అన్నది

పారిజాతం, భర్తని ప్రతివారం పట్నం తీసుకెళ్ళి డాక్టర్‌కు చూపించి తీసుకురాసాగింది.

ఖరీదయిన మందులు వాడడం వల్ల చంద్రం త్వరగానే కోలుకోసాగాడు.

దేశంలో జరుగుతున్న అక్రమ సంబంధాల కథలన్నీ తెలియాలన్న రూలేం లేదు.

అలా తెలిస్తే ఈ దేశంలో చాలా కుటుంబాలు అడ్రసుల్లేకుండా పోతాయి

ఐతే, ఇక్కడ, ఎప్పుడు, ఎవరు, ఎలా పసిగట్టారో గాని మల్లయ్య పారిజాతానికీ వున్న అక్రమ సంబంధాన్ని పాలెంలో సినిమా కథలుగా చెప్పుకోసాగారు

సినిమా కథలెప్పుడూ వినడానికి రసవత్తరంగానే వుంటాయి. ఈ రసవత్తరమైన కథ ఆ నోటా ఆ నోటా పడి చంద్రం చెవిని పడింది.


ఈ కథలు చంద్రం విని ముందుగా ఆశ్చర్యపోయాడు ఆపైన కోపం తెచ్చుకున్నాడు. కోపమైతే తెచ్చుకున్నాడు గానీ భార్య మీద వున్న నమ్మకాన్ని పోగొట్టుకోలేకపోయాడు. అందుకే భార్యను ఆ విషయమై ఎప్పుడూ అడగలేదు.

ఆ రోజు మల్లయ్య భార్య వూరు వెళ్ళి వుండడం వల్ల ఇంటి పనంతా పారిజాతం మీదనే పడింది.

అసలు ఉదయం లేచిం దగ్గర నుంచి వళ్ళంతా జ్వరం వచ్చినట్టుగా వుంది తలంతా పోటుగా వుంది ఆ రోజు 'పనిలోకి' వెళ్ళకుండా ఇంటి దగ్గరే వుండిపోవాలనుకుంది. మల్లయ్య పాలేరు వచ్చి కబురు చెప్పడంతో వెళ్ళక తప్పలేదు

పనులన్నీ అతికష్టం మీద పూర్తి చేసి, అన్నం కూడా వండి అన్నీ సర్ది వెళ్ళిపోదామనుకుని మల్లయ్యకు చెబుదామనుకుని ఆయన గదిలోకెళ్ళింది

గదిలోకి పారిజాతం రావడం చూసిన మల్లయ్య "రా పారిజాతం ! నీకోసమే చూస్తున్నాను ఈ రోజు మా ఆవిడ లేదు గదా, మనకు గొప్ప పండగనుకో ఆ పాకలో ఎప్పుడూ హడావుడియే మనకసలు ఈ రోజే



పెద్ద సందరం వెళ్ళి తలుపు వేసిరా" అన్నాడు

"నేను తొందరగా ఇంటి కెళ్ళిపోవాలను కుంటున్నానండి"

"ఏవిటీ? ఇంటికా?"

"అవును బాబుగారూ! ఈ రోజు నా ఒంట్లో కూడా బావుండలేదు."

"చూడు పారిజాతం! ఆనందానికి ఒంట్లో బావుండకపోవడం పెద్ద అవరోధం కాదు"

"ఈ ఒక్కసారికీ దయ చూపండి బాబుగారూ"

"దయా....?" అంటూ మల్లయ్య పకపకా నవ్వేసి—

"నా దయ నీ కెప్పుడూ వుంటుంది.... అవునూ! రేపు మీ ఆయన్ని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలికదూ? అందుకు 'డబ్బు' కావాలి గదా?" అన్నాడు.

కొందరికి, ఎప్పుడు ఎక్కడ దెబ్బ కొట్టాలో బాగా తెలుసు ఈ విద్య తెలిసిన వారికి జీవితంలో 'ఫెయిలవడం' అంటూ వుండదు!

అవును: భర్తను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి

అందుకు డబ్బు కావాలి!

ఈమాట వినడంతోనే పారిజాతం కంపించిపోయింది.

నోట మాటరాక నిస్పృహాయంగా అలాగే నిలబడిపోయింది!

ఇప్పుడు తను ఇంటి కెళ్ళలేదు

కళ్ళు తిరుగుతున్నట్టనిపించగా కుర్చీని ఆసరాగా చేసుకొని అతికష్టంగా నిలబడింది

సరిగ్గా ఆ సమయంలోనే మల్లయ్య చిద్విలాసంగానవ్వుతూ కుర్చీలోంచిలేచి పారిజాతం భుజాలమీద రెండు చేతులూవేసి, ఆమెను ముందుకు లాక్కున్నాడు!

దీన్ని బలాత్కారమంటారో లేక ఇద్దరూ కలిపి చేసుకున్న ఒడంబడికలో ఒక భాగమంటారో తెలియదుగానీ పారిజాతక మాత్రం చిన్న ఆర్తనాదం లాటిదిచేసి మల్లయ్యకు లొంగిపోయింది

ఆమె ఆర్తనాదం ఎవరికీ వినిపించదు

ఒకవేళ వినిపించినా, ఆ ఆర్తనాదం ఎటువంటిదో ఎవరికీ తెలియదు!

ఒక అబల తనను తాను అర్పించుకుంటూ నిస్పృహాయంగా చేసిన ఆర్తనాదం అది!

ఆ గదిలోంచి బయటకొచ్చిన పారిజాతానికి అంతా చీకటిగానే వుంది. దారి తప్పిన మనిషి గనుక అ చీకటిలో దారి వెదుక్కుంటూ నడవసాగింది.

ఇంత రాత్రి వరకూ ఎక్కడున్నావని మావ అడిగితే తనేం సమాధానం చెబుతుంది? తనే నాడైతే శారీరకంగా పతనమయిందో ఆనాటి నుంచే భర్తతో సరిగా వుండలేకపోతోంది!

తను చేస్తున్న ఈ పాపపు పనిని భర్తకు చెప్పి క్షమించవలసిందిగా కోరుకోవాలని చాలాసార్లు అనుకుంది

ఈ నీచపు పనిని తనెందుకు చేస్తోందో అర్థంచేసుకుని ఆదరించగలడా భర్త? తప్పును ఒప్పుగా చిత్రీకరించి భర్త సానుభూతి పొందాలని తనకెప్పుడూలేదు.

తప్పనేది ఎప్పటికీ తప్పేగదా!

"ఎవరా నడిచేది" ఎవరో ప్రశ్నించారు.

నడుస్తోన్న పారిజాతం ఆగిపోయి—

"నేనే!" అన్నది.



మార్గం?

స్వామీజీ దగ్గరకు వెళ్ళాడు స్వామీ రావు

"స్వామీ! నేను ఎం.ఎ. పాసయ్యాను. ఆరేళ్ళనుంచీ ఉద్యోగంలేదు దొరికే మార్గం ఏదైనా..?' అడిగాడు

'అది తెలియకే నేనిలా అయ్యాను నాయనా... అన్నారు స్వామీజీ

-ఎ సత్యప్రసాద్ (బండారులంక)

"నువ్వటే!" ఫెళ్ళున నవ్వు.

"అవున్లే ఇంత రాత్రి చీకట్లో నువ్వు కాకపోతే ఇంకెవరొస్తారు?"

"అవునే, మీ ఆయని జబ్బు నయమయిపోతోందంటగా. మొత్తానికి డబ్బు బాగా వెనకేసుకొన్నావ్."

"ఆ మల్లయ్య ఇంటినుంచేగా వచ్చేది?"

దారిలో అనేకమంది అనేక రకాలుగా మాటలతో హింసించినా ఎవరికీ సమాధానం యివ్వకుండా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూవుండగా ఇంటికి చేరింది పారిజాతం!

అప్పటి వరకూ ఎన్నో ఆలోచనలతోవున్న చంద్రం భార్యను చూడ్డంతోనే కోపంతో వూగిపోయాడు

ఈరోజు అటో ఇటో తేల్చుకోవాలనుకున్నాడు. తన అసమర్థతను ఆసరాగా తీసుకుని భార్య చేస్తున్న నీచపు పనిని ఈరోజుతో సమాధి చేసెయ్యాలనుకున్నాడు.

అవును! ఇప్పుడే, ఈ క్షణంలోనే తేల్చెయ్యాలి!

చంద్రం తలెత్తి భార్యకేసి చూశాడు.


అప్పుడే పారిజాతం నిద్రపోతున్న పిల్లలకు బట్టలు సరిచేస్తూంది.

బడలిపోయిన ముఖంతో, వొళ్ళంతా చెమట్లుపట్టి, ఏ క్షణంలోనైనా 'షోసొచ్చి' పడిపోవడానికి సిద్ధంగావున్న భార్యను చూడగానే చంద్రానికి ఎక్కడలేని జాలి కలిగింది.

తన భార్య చేస్తున్నదంతా ఎవరికోసం?

తన కోసం తన పిల్లలకోసం?

ఎవరో ఏదో అనుకుంటున్నారని, వాటిని



నమ్మి తను భార్యను అనుమానించటంలో అర్థం వుందా?

నిజమైనా అబద్ధమైనా,

పారిజాతం తనకు భార్యే!

భార్యను ఏమీ అనకుండా ఆలోచనలతో కళ్ళు మూసుకున్నాడు చంద్రం!

* * *

ఏ జబ్బు ఏ మనిషికి ఎప్పుడు ప్రారంభమై నయమవుతుందో తెలియదు. కానీ. చంద్రానికి చాలా త్వరగానే నయమయింది

డక్టర్. చంద్రం జబ్బుకు ఏపేరు పెట్టాడో తెలియదుగానీ ఇంత త్వరగా నయమయినందుకు ఎక్కువగా ఆనందించింది పారిజాతమే.

ఇకనుంచి తను మల్లయ్య దగ్గర పనులు మానేసి ఇంటి దగ్గరే వుండిపోతుంది.

ఆ సంగతే ఓరోజు మల్లయ్యతో చెప్పింది–

"బాబుగారూ! మా కుటుంబానికి మీరుచాలా సహాయం చేశారు నా మావకు జబ్బు నయమయింది ఇకనుంచి ఆదే పనుల్లోకి వస్తాడు. నేను రానండి"

"ఏవిటీ? నువ్వురావా? మరి మన యవ్వారాలు...."

"ఈ రోజు నుంచీ అన్నీ మరచిపోండి నేనింక ఆ పాపపు పనులు చేసి నా మావకు అన్యాయం చెయ్యలేను

"అన్యాయమా ?" మల్లయ్య వికృతంగా నవ్వేసి–

"ఈ నీతి సూత్రాలు ఎప్పటి నుంచి నేర్చుకున్నావే పారిజాతం?" అన్నాడు.

ఈ మాటకి పారిజాతం మాట్లాడలేదు వొంచిన తలెత్తకుండానే వుండిపోయింది. అవును ఆమె ఎప్పుడూ తలెత్తలేదు.

"పిచ్చి పిచ్చి కబుర్లు మానేసి సాయంత్రానికి పాకదగ్గరికురా.... ఏవిటి? తెలిసిందా?"

"నేను రాలేనండి"

ఈ మాటకి మల్లయ్యకు ఎక్కడలేని కోపం వచ్చింది ఎదురుగావున్న పారిజాతాన్ని ఇష్టం వచ్చినట్లు బాదాలనిపించింది. రెండడుగులు ముందుకువేసి. పళ్ళు పటపటా కొరుకుతూ–"నా కెదురు సమాధానం చెప్పే స్థితికొచ్చావన్నమాట చూస్తాను. నీ సంగతేవిటో చూస్తాను." అన్నాడు.

ఇంక మల్లయ్యతో మాట్లాడ్డం ఇష్టంలేక పారిజాతం అక్కడనుంచి వచ్చేసింది

దాదాపు నాలుగు రోజులు గడిచాయి

ఈ నాలుగు రోజుల్లోనూ ఏ ఒక్కరోజూ కూడా మల్లయ్యకు పారిజాతం కనిపించలేదు ఇక మల్లయ్య వుండబటలేక మధ్యాహ్నం సమయంలో పారిజాతం ఇంటికే వచ్చాడు.



## ఇదే కేసు

బ్రతుకుమీద రోత పుట్టింది వీరభద్రానికి. అడివిలోకివెళ్ళి ఉరి వేసుకున్నాడు ఓ చెట్టుకి

అయితే ఉరి పడకుండా చెట్టుమీదున్న వ్యక్తి తాడు తెంపేశాడు క్రిందపడ్డ వీరభద్రం కోపంగా చూశాడు పైకి

"నేను హాయిగా ఆత్మహత్య చేసుకోబోతుంటే నీ కెందుకయ్యా," అడిగాడు

"నేను అలాగే అనుకున్నాను కానీ చావబోయేముందు రెండు నిముషాలు విపరీతమైన బాధ వుంటుందయ్యా" అన్నాడు చెట్టుమీద వ్యక్తి

"అయితే నువ్వు ఇకే కేవన్నమాట విన్నెవరు రక్షించారు' అడిగాడు వీరభద్రం"

'ఎవరూ రక్షించలేదు' అని మాయమైపోయాడా వ్యక్తి

రామశ్రీను (విశాఖపట్నం)

ఆ సమయంలో ఇంట్లో ఎవరూలేరు. పారిజాతం ఒక్కతే చినిగిపోయిన బట్టలను సూదితో కుడుతోంది మల్లయ్యను చూడ్డంతోనే చేస్తున్న పని ఆపి–

"రండి" అంటూ చిన్నబల్లవుంటే, ఆ బల్ల చూపించింది కూర్చోవడానికి

"నిన్నంతా నీ కోసంచూశాను. రాలేదేం!" అన్నాడు మల్లయ్య

ఆ మాటలో కోపం వుంది

కసివుంది ఆజ్ఞవుంది

"నేను చెప్పానుగదా బాబుగారూ"

"చెప్తే సరిపోతుందనుకున్నావా ?"

"నా మావను బతికించుకోవడం కోసం ఒక తప్పుచేశాను మళ్ళా తప్పులు చేసుకుంటూ పోలేనండి"

"అవునే! నీ మావకు తగ్గిపోయింది గదా! నా అవసరం తీరిపోయింది"

"లేదండి మీ అవసరానికి ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు మీక్కావలసిన తృప్తినిచ్చాను. నా అవసరానికి మీరు డబ్బిచ్చారు. నా మావకు నయమవగానే ఇటువంటి పనులు ఇంక చెయ్యనని ముందే మీకు చెప్పాను!

"ఇప్పుడెన్నయినా మాట్లాడతావే.... అంతేనా? లేకపోతే. ఇంకెవడ్నయినా...." మల్లయ్య మాట పూర్తికాకుండానే పారిజాతం కోపంగా–

"బాబుగారూ! మీరు ఈ వూరికే పెద్దలు కావచ్చు. మీ మాట అన్నిచోట్లా చెలామణీ కావచ్చు ఇక్కడ మాత్రం అది సాగదు ముందిక్కడనుంచి వెళ్ళిపోండి"అని అన్నది




స్టీలు మరియు ప్లాస్టిక్ జార్లలో
450 వాట్ మోటార్, రెండు రంగులతో

JOHNSON

మిక్సర్ గ్రైండర్
శక్తికి. పనితనానికి కూడా ఒకటో రకము.

సోనో విజన్,
ఏలూరు రోడ్డు, విజయవాడ-2.



వీనస్ వాటర్ హీటర్లు
IS : 2082
మొదటగా I.S.I. సర్టిఫికెట్ పొందినది.
వెంట్ పైప్ అక్కరలేనిది; దృఢమైన నిర్మాణము!!
మెయిన్ డీలర్లు :
సోనో విజన్,
ఏలూరు రోడ్డు, విజయవాడ–2.
Suvarna




ఎక్కడో....

బస్టాపులో నిలుచున్న అమ్మాయి బావుంది.

ఆమెతో మాట్లాడాలనిపించింది ఆనందరావుకి

"మిమ్మల్ని ఎక్కడో చూపినట్టు గుర్తు.." అన్నాడు ఆమె దగ్గర కెళ్ళి.

"నిజమే....మీరు నన్ను పిచ్చాసుపత్రిలో చూశారు....నేను అక్కడ పని చేస్తాలెండి" అందామె

–బి వి ప్రసాద్ (విజయవాడ)

"నీ ఇంటికొచ్చిన నన్నే అవమానిస్తున్నావ్ కదూ? నేనెవరినో నీకు తెలుసు ఈరోజు నుంచీ నువ్వూ, నీ మొగుడూ, నీ పిల్లలూ ఎలా బ్రతుకుతారో చూస్తాను" అంటూ మల్లయ్య విసురుగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

* * *

తెల్లవారింది

తెల్లవారినా ఇంకా నిద్రలేవని తల్లిని లేపినా, ఆ తల్లి లేవలేదు.

తల్లి ఎంతకీ లేవకపోవడంతో భయపడిన పిల్లలు తండ్రిని పిలిచారు.

చంద్రం చనిపోయిన భార్యను చూసి ఘొల్లున యేడ్చాడు

చనిపోయిన పారిజాతం గురించి చాలా మంది చాలా రకాలుగా గుసగుసలాడుకున్నారు,

నిన్నటి వరకూ పిల్లలతో, భర్తతో వుండి ఈ రోజు ఏ జబ్బూ లేకుండా పోయిన పారిజాతాన్ని పుణ్యాత్మురాలన్నారు

కానీ, ఆమె ఎలా చనిపోయిందో ఎవరికీ తెలియదు।

కానీ, ఆమె చనిపోయింది।

ఇది హత్యకాదు.

ఆత్మహత్యే।

తనను తాను, ఈ పాపపు శరీరాన్ని మళ్ళా భర్తకు పంచలేక, ఎవరికి అనుమానం రాకుండా పారిజాతమే చనిపోయింది।

ఈ అవమానాలనుంచీ, అవహేళనలనుంచీ పారిజాతం తొలగిపోయింది

భార్య ఎందుకు చనిపోయిందో చంద్రం ఖచ్చితంగానే వూహించగలిగాడు ఆమె మాన్యానికీ, త్యాగానికీ, మనస్సులోనే జోహారులర్పించాడు. ఈ సమాజాన్ని ధైర్యంగా ఎదురించలేక భార్య పిరికిగా చనిపోయినందుకే మిక్కిలి విచారించాడు

శవానికి చేయవలసిన ఏర్పాట్లన్నీ చేసిన తర్వాత, ఆ కట్టెను తీసుకెళ్ళడానికి డబ్బులేక మేళాలు పెట్టలేకపోయాడు చంద్రం.

అప్పటికి టైమ్ దాదాపు సాయంత్రం ఐదు గంటలు దాటుతోంది ఎండ తీక్షణత ఇంకా తగ్గలేదు. గాలి వెచ్చగా వీస్తోంది.

కుటుంబం కోసం తనను తాను ఆత్మార్పణ చేసుకున్న ఆ పుణ్యాత్మురాలిని స్మశానానికి తీసుకెళ్ళడానికి ఎవరూ ముందుకు రాలేదు.

చనిపోయిన పారిజాతం ఎటువంటిదో తెలిసిన నలుగురైదుగురు యువకులు ముందుకొచ్చి ఆ 'పాడి'ని భుజాలమీదకేసుకున్నారు.

పారిజాతం చనిపోయిందన్న వార్త తెలిసిన మల్లయ్య జాలిపడలేదు కదా, పైపెచ్చు ఇంకా కోపంతో చిందులు తొక్కాడు అసలా కుటుంబం మొత్తం నాశనమవ్వాలని ఆశించాడు. తన మాటనుకాదన్న వారెవరూ సుఖంగా బ్రతకడానికి వీల్లేదు। "ఆగండి" అన్న గర్జనకు 'పాడిని' తీసుకెడుతున్న వారిందరితో పాటుగా చంద్రం కూడా ఆశ్చర్యపోయాడు.

"ఈ వూరు స్మశానంలో శవాన్ని తగలెట్టడానికి వీల్లేదు. ఈ స్మశానం అయ్యగారిది"

ఈ మాట వినడంతోనే పాడెని మోస్తున్న చంద్రం–"ఎవరు మీ అయ్యగారు "అన్నాడు.

"నీకు తెలియదట్రా ; మల్లయ్య బాబుగారు ఆయనే ఈ సంగతి చెప్పమన్నారు."

కానీ, పాపం చంద్రానికి తెలియదు,

స్మశానమనేది వూరంతటికీ చెందుతుందనీ, అది ఏ ఒక్కరిదీ కాదని ;

"ఐతే....?" అన్నాడు చంద్రం

"దాన్నిక్కడ కాల్చడానికి వీల్లేదు."

"మరేం చెయ్యాలి ;"

"ఏమో. అది మాకు తెలియదు."

ఈ మాట వినడంతోనే చంద్రం పాడిని క్రింద పెట్టి—"మీ అయ్యగారేరి ;" అన్నాడు.

ఆ సమయంలో మల్లయ్యే మేడ మీద నుంచుని ఈ వినోదాన్ని తిలకిస్తున్నాడు. అప్పటికే జనం చుట్టూచేరారు.

చంద్రం తలెత్తి ఆ మేడవేపు చూశాడు. ఏదో నిర్ణయించుకున్న వాడిలా కోపంతో వూగిపోతూ క్రింద పెట్టిన 'పాడి' లోంచి వాసాం' ఒకోటి చర్రున లాగి మల్లయ్య భవంతి వేపు నడవసాగాడు.

చంద్రం నిర్ణయం తిరుగులేనిది.

ఈరోజుతో మల్లయ్య జీవితం సమాప్తం కావలసిందే।

పశ్చిమటి దిశలో ఎర్రని ఆకాశంలో కడపటి కిరణాలు చాలా శక్తివంతంగా వున్నాయి.

చంద్రం ఆవేశంగా అడుగువేస్తూ ముందుకు నడుస్తున్నాడు అతని చేతిలోవున్న 'వాసాం' కోపంతో బిగుసుకుంటోంది అలా ముందుకు నడుస్తున్న చంద్రం ముఖంమీద ఎర్రని కిరణాలుపడి, అతను రుద్రుడిలా వున్నాడు।

పశ్చిమాన ఇంకా సూర్యుడు కృంగిపోలేదు।

*

